
# లక్ష రూపాయల కథ

● దగ్గుమాటి పద్మాకర్

**ఈ కథని నాకన్నా కూడా**
**మెట్టా గోవిందరెడ్డి బాగా**
**చెప్పగలడని నా నమ్మకం.**
**అయితే ఆయన కథకుడు కాదు.**
**అంతకన్నా బాగా ఆనం**
**వివేకానందరెడ్డి చెప్పగలడు.**
**కానీ ఈ కథలో మెట్టా**
**గోవిందరెడ్డి ఉంటాడు గాని**
**ఆనం వివేకానందరెడ్డి లేడు.**
**ఇకపోతే నేనే చెప్పాలి.**



బొమ్మలు : అక్బర్

ఆ రోజు సాయంత్రం ముగ్గురం సాహితీ మిత్రులం కలిసి మెట్టా గోవిందరెడ్డి ఇంటికి పోయ్యాం. మాలో పళని శంకరయ్య, వెన్నెల సోమసుందరం అనే వాళ్లిద్దరూ కవులు. నేను కథకుడిని. పళని శంకరయ్య కవిత్వం పుస్తకానికి ఆర్థిక సహాయం కోసం వెళ్లాం మేము.

మెట్టా గోవిందరెడ్డికి స్థానిక రాజకీయాలు, కాంట్రాక్టులు ప్రధాన వ్యాపకాలే అయినా సాహిత్యాన్ని ఆదరించే గుణం కూడా ఉంది. అది అచ్చం వాళ్ల నాన్న మెట్టా రాఘవరెడ్డి లక్షణం అని మా నెల్లూరులో అందరూ అంటుంటారు. మాలో శంకరయ్యని చూడగానే "రావయ్యా శంకరయ్యా రా! ఏంది సంగతులు? కవిత్వం బాగానే రాస్తా ఉండావా? అప్పుడప్పుడు నీ పేరు పేపర్లో చూస్తా ఉండాలే అబయ్యా .." అన్నాడు నవ్వుతూ మెట్టా గోవిందరెడ్డి.

"ఏదో మీలాంటివాళ్ల అభిమానం, ఆదరణ వల్ల లభించే సంతోషంతో రాస్తుంటాం సార్" అన్నాడు శంకరయ్య.

"ఆ శంకరుడికి లొక్కం లేకపోయినా నీకు బాగా ఉంది శంకరయ్యా" అని, సోమసుందరం వైపు తిరిగి "నువ్వెట్టా ఉండావు అబయ్యా, బాగుండావా?" అన్నాడు.

"బాగానే ఉండాను సార్" అన్నాడు సోమసుందరం.

ఆ తర్వాత నావైపు తిరిగి, "ఈ యబ్బాయెవురు?" అనడిగాడు.

"మునికంటి రాజు అని కథలు బాగా రాస్తాడు సార్. కొన్ని మంచి కథలు రాసి పేరు తెచ్చుకున్నాడు" పరిచయం చేశాడు శంకరయ్య.

"అయితే నిన్ను రాజని పిలవాల్నా! ఏ దేశానికి రాజువబయ్యా? సరేలేగాని, ఇంతకీ యెన్ని కథలు రాసినావు?"

"పది పన్నెండు కథలు రాసినాను సార్" అన్నాను వినయంగా. నిజానికి గోవిందరెడ్డికన్నా ఆ గదిలో పెద్ద దున్నపోతంత ఉన్న ఆయన సోఫా ఎక్కువగా భయపెడుతోంది నన్ను. ఇంతలో ప్లేట్లో నాలుగు కాఫీ కప్పులు పెట్టుకుని వచ్చింది పనమ్మాయి. తనొకటి అందుకుంటూ "తీసుకోండి"అని, ఆ తర్వాత "అదిసరేగాని, నువ్వు రాసిన మాంచి కథొకటి జెప్పు యింటా" అన్నాడు గోవిందరెడ్డి.

" 'చంద్రుడిమీద మచ్చ' కథ చెప్పు రెడ్డీ" అన్నాడు సోమసుందరం పుసుక్కున. తను అలాగే పిలుస్తాడు నన్ను.

ఆ మాటతో గోవిందరెడ్డి ఆశ్చర్యంగా చూస్తూ, "ఇందాక అదేంది! మునికంటా .. శనికంటా .. రాజంటివి గదబయ్యా" అన్నాడు.

"నాకు కులం పేరుతో వచ్చే అదనపు గుర్తింపు ఉండకూడదని అలా పెట్టుకున్నాను సార్ మొదటినుంచీ".

"ఒరే నీ పాసుగాలా .. నీ దగ్గర చాలా విషయముందే అయితే! ఇట్రా. ఇట్నొచ్చి కూసో .." అన్నాడు తనపక్కన సోఫాని తట్టి చూపిస్తూ. కొస్త జరిగి.

ఆ దున్నపోతులాంటి సోఫామీద ఇరీడైన తెల్లటి పంచె చొక్కాతో వెంకయ్యనాయుడులాగా కనిపిస్తున్న గోవిందరెడ్డి పక్కన కూర్చోవాలంటే భయమేసింది నాకు. అంత భయంలోను నేను రెడ్డిని కావడం వల్ల ఆ గౌరవం దక్కిందని అర్థమైంది నాకు.

మంత్రమేసినట్టు గమ్మునగా పోయి సోఫాలో కూర్చున్నాను నేను. నాకు జరిగిన ఈ మర్యాదకి శంకరయ్య సోమసుందరం ఇద్దరూ ఆశ్చర్యపోయారు. వాళ్ల కళ్లలో మెరుపు కనిపించింది ఒక్కక్షణం.

"ఏంది ... నీకు రెడ్డి అని పిలిపించుకోవడానికి చిన్నతనమా?"

"నా వ్యక్తిత్వానికి, రచనలకి గుర్తింపు ఉండాలగాని కులానికి ఉండకూడదని నా అభిప్రాయం సార్."

గోవిందరెడ్డి గొంతు పెంచి అన్నాడు, "వాడెవడో ఒక రెడ్డి రేప్ చేస్తాడబయ్యా! రెడ్లందరూ రేప్ చేసినట్టా? ఒక కమ్మోడు దౌర్జన్యం చేస్తే కమ్మోళ్లందరూ చేసినట్టా?"

శంకరయ్య, సోమసుందరం ఇద్దరూ తమ గొంతులో వెలక్కాయ పడ్డట్టు చూస్తా ఉండారు. వచ్చిన యవ్వారం చెడిసిందని వాళ్ల అనుమానం.

"నా ఉద్దేశం అదికాదు సార్! అన్ని కులాలు సమానమే అనుకున్నప్పుడు ప్రత్యేకంగా కులం గుర్తింపు ఉండకూడదని నా అభిప్రాయం."

"అన్ని కులాలు, అందరు మనుషులు సమానమే! నేను కాదన్నానా ఆబయ్యా! అయితే నీ కులానికి నువ్వు వ్యతిరేకం కాదుగదా?"

అర్థం కాలేదు నాకు. అదే అన్నాను గోవిందరెడ్డితో.

"అంటే రెడ్లందరూ యదవ నాయాళ్లని డిసైడై పోయినావా! బలేవాడివి ఆబయ్యా నువ్వు"

"అదేం కాదుసార్, కులరహిత సమాజం కావాలని నా లక్ష్యం" నా గొంతులో మెత్తటి గాంభీర్యం తెచ్చిపెట్టుకుని అన్నాను నేను.

"ఇంత పిచ్చోడివి నువ్వేం కతలు రాస్తావుండావు ఆబయ్యా! కులం లేనిదెక్కడ చెప్పు? మాలోళ్లు, మాదిగోళ్లు, యాదవులు, గౌళ్లు ... ఈమాదిరిగా అందరూ కులాల పేర్లు తగిలించుకుంటానే ఉండారుగదా యిరవై యేళ్లనించీ! ఇప్పుడు వాళ్లందరినీ చూసి గోవిందరెడ్డి అని పిలిపిచ్చుకునేదానికి నాకేమైనా దురిగిపోద్దా?"

"... ... ... ..... ... ..."

"ఏందబయ్యా మాట్లాడవు? అదిగాదు, రాజకీయాల్లో ఓట్లు ఎట్లబడతాయో తెలీదా నీకా? రెడ్లు కమ్మోళ్లు గాకుండా ఇంకొక కులపోడు మన స్టేట్లో సీయమ్మవతాడా చెప్పు? కులం పొయ్యేదేందీ! బస్సెక్కి బట్టేపాటికి పోవాల్సిందే! కులం ఇంకా బలపడతావుంటే! అదిగాదు, మనోళ్లు అమెరికా పొయ్యిగూడా తానా, ఆటా, నాటా, తీటా అని అక్కడగూడా గేదర్ చేస్తావుండారా లేదా? పొయినోడు ఒక్కొక్కడు ఇంకో పదిమందిని తమ కులపోళ్లని దీసుకెళ్లాలని ... అదేదో ఫత్వా జారీ చేస్తావుండారు తెల్సా? అమెరికాలో కూడా కులాన్ని మర్రిచెట్టు పెంచినట్టు పెంచతావుండారు!"

"..........." నేనేం మాట్లాడలేదు.

"నువ్వు కులం లేదనుకోంగానే అదేం మాయంగాదబయ్యా! నిప్పుకోడి గురించి తెలుసా నీకు? అది దూరం నించే నక్కని చూసి గుంటొకటి తోడి తలకాయ మటుకే దాంట్లో పెట్టి నక్క కనపడక పొయ్యేతలికి ఎల్లిపొయ్యిందని అనుకుంటదంట. ఆపట నక్కొచ్చి దాని మెడకొరికి సక్కా తినేసి పోద్దంట! నీది నిప్పుకోడి జ్ఞానం. ఇట్లన్నానని ఏమనుకోబాక. అసలు దేశం కోసం బతకడం అంటే కులం కోసం బతకడమే మన దేశంలో. అర్థైలుసుకో నువ్వు మనోడని చెప్తావుండా .." అని భుజమ్మీద చెయ్యేశాడు గోవిందరెడ్డి.

శంకరయ్య మధ్యలో కల్పించుకుని నన్ను కాపాడాలని ప్రయత్నించాడు;

"అప్పట్లో కమ్యూనిస్టు పార్టీలో కొన్నేళ్లు తిరిగాడు సార్. కారంచేడు, చుండూరు సంఘటనల తర్వాత ఆ ప్రభావంతో పేరు ఇలా పెట్టుకున్నాడు సార్" అన్నాడు చేతులు నలుపుకుంటూ.

"అట్ట చెప్పయితే! అన్నదేగానీ, కమ్యూనిస్టులకి కులం లేదా? వాళ్ల పార్టీల్లో కూడా ఇంకొక కులమోడిని నాయకుడు

**"మనోళ్లు అమెరికా పొయ్యిగూడా తానా, ఆటా, నాటా, తీటా అని అక్కడగూడా గేదర్ చేస్తావుండారా లేదా? పొయినోడు ఒక్కొక్కడు ఇంకో పదిమందిని తమ కులపోళ్లని దీసుకెళ్లాలని ... అదేదో ఫత్వా జారీ చేస్తావుండారు తెల్సా? అమెరికాలో కూడా కులాన్ని మర్రిచెట్టు పెంచినట్టు పెంచతావుండారు!"**



కానీరు శంకరయ్యా మీకొక రహస్యం జెప్తా యినండి. కాంట్రాక్టులు నా యాపారం గదా. చాలామంది కమ్యూనిస్టులకి గూడా వాళ్ల పార్టీ వొక యాపారమే. కాదంటే, మేం ఎప్పుడూ కంకర, యిటుక, సిమెంటు, టిప్పర్లు అనే పదాలు మాట్లాడతా ఉంటాం; వాళ్లు మార్క్సు ఎంగెల్సు బూర్జువాలు, పేదలు అనే మాటలు మాట్లాడతా ఉంటారు. కొందరు డబ్బు సంపాదిస్తారు, కొందరు పేరు సంపాదిస్తారు. పేరంటే గుడ్విల్ అన్నమాట, అది ఓల్డ్ వైన్ లాంటిది. వేల్యూ పెరగతా ఉంటాది, ఎప్పుడైనా డబ్బే"

"మనుషులు తప్పు చేస్తుండారని సిద్ధాంతాలు తప్పుకావు గదా సార్" కాస్త నిబ్బరంగా అన్నాను నేను.

వెంటనే గోవిందరెడ్డి నా భుజం తట్టి, "ఈ పాయింటు మాట్లాడతా ఉండావంటే నువ్వు కథలు బాగానే రాస్తావని అనిపిస్తా ఉండాదబయ్యా" అన్నాడు.

"థాంక్యూ సార్" అన్నాను నేను నవ్వుతూ.

"అద్సరేగాని కులం ఎప్పటికీ పోదబయ్యా! రాజకీయ నాయకులు పోనీరు గూడా. ఓట్లు కూడెయ్యాలంటే కులం అవసరం అబయ్యా నువ్వెన్ని జెప్పు అదుంటాది. ఇప్పుడు చంద్రబాబు అనే పేరు ముఖ్యమంత్రితోపాటు మనూర్లో ఇంకొకరికి ఉండాదనుకో, వాళ్లిద్దరూ సమానం అయిపోతారా యేంది! అందరూ సమానమే అనేది మనసులో ఉండాల. బస్సుల్లో ఆయిల్ పూసుకున్న చొక్కా తొడుక్కొన్న మెకానిక్కొకడు నీ పక్కన కూకుంటే నీకు చికాగ్గా ఉంటదా లేదా? అది కులాన్ని బట్టి గాదుగదా. దానికి వాడు పీలైతే వాడి కర్మ! అవతలోడి అసొకర్యం వాడు జూడాల, అవతలోడు మనిషని యాడూ చూడాల. ఇయ్యన్నీ ఒక్క జనరేషన్లో పొయ్యేయి గాదు. అట్టని పోకుండా ఉండవు. పోతాయి ఎప్పటికో - అప్పుడుదాకా ద్రౌపతిగడా జుట్టు ముడేసుకోకుండా శపథం జేసినట్టుండాది నీ యవ్వారం. ఇప్పుడు నువ్వు కోరుకునేది యేందో నేనే జెప్తాను యినుకు. కులం కారణంగా ఒకడిని చీప్గా చూడగూడదు, అంతా సమానమే అంటావు. అంతేగదా" అన్నాడు.

"అంతేసార్" అన్నాను గోవిందరెడ్డి వాక్ప్రవాహం ఎలా ఆపాలో అర్థంగాక.

"ఇప్పుడు ముఖ్యమంత్రులు, మంత్రులు ఈళ్లంతా కలెక్టర్ల దగ్గరనించి ఎత్తుకుంటే అధికారులందరినీ దబాయించి చీప్గా మాట్లాడతా ఉంటారుగదా, యిదెట్ల బోతాది! పోదబయ్యా పైనుండే వాడు కిందుండేవాళ్లి అట్టనే జూస్తాడంతే, పులిగదా మేకని జూసినట్టు. ఇక్కడగూడా కులం లాంటి దేదో కనపడ్డంలే! ఇది ఆధునిక న్యాయం అన్నమాట. ఒక మనిషి రేంజనేది కులంలోనో, డ్రస్సులోనో, క్వాలిఫికేషన్లోనో ఉండదు. క్వాలిటీలో ఉంటది. ఇంకా జెప్తా యినుకు. నా దగ్గరకి రోజూ పది నించి పాతికమంది రెడ్లొచ్చి మాట్లాడిపోతా వుంటారు. వాళ్లల్లో ఒక్కడు గూడా కతలు రాసేవోడు లేడు. కానీ నువ్వు

రాస్తావుండావు. ఇది నీ క్వాలిటీ. నీ పాసుగాలా, పేరులోనించి రెడ్డి తీసేసినావే!" నవ్వుతూ నా భుజం తట్టాడు గోవిందరెడ్డి.

మళ్ళీ తనే మొదలుపెట్టాడు.

"శంకరయ్య సుందరం అక్కడ కూచోనుంటే నిన్ను నా పక్కన కూచోమన్నా గదా. ఎందుకు జెప్పు?"

ఎట్ల చెప్పాలో అర్థం కాలేదు నాకు. అయినా అమాయకంగా ముఖం పెట్టి, "రెడ్డినని ..." నసిగాను నేను.


"నాకంత కులపిచ్చి ఉండాదనుకుంటా ఉండావా అయితే?"

నాకు తలమీదికి పోయింది చెయ్యి. తలగీరుకుంటూ అన్నాను, "సారీ సార్, తెలీదు సార్" అన్నాను, ఇప్పటిదాకా మాట్లాడిందంతా కులపిచ్చిగాక మరేంది అనుకుంటూ.

"చెప్తా యిను. నేను యింకొక కులాన్ని తక్కువగా చూడను. నా దగ్గర యాభైమంది జీతగాళ్లు, రెండొందలమంది కూలోళ్లు ఉంటారు. పని, జీతం, కూలి, లాభం, నష్టం చూస్తానంతే నేను. నేను అనేది యేందంటే, 'మన కులంలో ఒక మంచి రచయిత ఉంటే మన కులానికి ఆ గుర్తింపు ఎందుకు దక్కగూడదు అంటా? నువ్వు కులానికి ద్రోహం జేస్తావుండావు అబయ్యా .. తప్పది" సోఫా రెక్కని తడుతూ అన్నాడు గోవిందరెడ్డి. "మా బాబు మెట్టా రాఘవరెడ్డి ఏవో పద్యాలు, కవిత్వం రాసేవాడు. నేను రాయకపోయినా కొస్త సదవతా ఉంటాను. ఆ గౌరవం నాకు కవులమీద ఉండబట్టే గదా మీరూ వొచ్చారు. శ్రీశ్రీకి, రావిశాస్త్రికి బ్రామ్మలని గౌరవం తగ్గిందా? రామారావు, సావిత్రిల యాక్టన్ని మనం కులంతో జూసినామా? అట్లే అట్లజూడు, అంబేద్కర్ ఫ్యామిలీ ఫోటో మాయింట్లో గోడకి. రేర్ ఫోటో అది నీకెక్కడా దొరకదు. మా బాబు సంపాయిచ్చాడు దాన్ని. ఆయన చిన్నప్పుడే జాషువాని దీసుకొచ్చాడంట మా యింటికి."

అటే చూశాను తలతిప్పి. తన భార్య నౌకరుతో కలిసి ఒక చెట్టుకింద అరుగుమీద డాక్టర్ అంబేద్కర్ కూర్చున్న ఫోటో అది.

"అంబేద్కర్‌ని ఉపయోగించుకునే వాళ్లు చాలామంది ఆయన్ని తమ కుల నాయకుడుగా కుదిస్తావుండారు. కానీ నేను గొప్ప దేశనాయకుడుగా జూస్తా అంబేద్కర్‌ని. ఇంతకీ నేజెప్పేది యేందంటే పండు చెట్టుకి అతుక్కుని ఉంటే ఉండే అందం వేరు, కోసేస్తే ఉండే అందం విలువా వేరు. నువ్వు కులం నించి వేరుపడిపోతాక. నీ ప్రిన్సిపుల్స్ నాకిష్టమే. కాని మన కులంలో మంచి కవి, కతకుడు ఉండాడంటే మన కులానికి గౌరవం, నీగ్గూడా కులం సపోర్టు. ఇయిరెండూ రెండుపక్కలా ప్రయోజనాలు. ఆ అవకాశం నువ్వెందుకు పోగొట్టుకోవాల జెప్పు? ఏటికి ఎదురీదాలంటే కూటికి కొరవుండగూడదు. ఆలోచించుకో, అయినా నీలాంటి కవులు, కతలు అయ్యి రాసేవోళ్లని బలవంత



" ... మీకొక రహస్యం జెప్తా యినండి. కాంట్రాక్టులు నా యాపారం గదా. చాలామంది కమ్యూనిస్టులకి గూడా వాళ్ల పార్టీ వొక యాపారమే. కాదంటే, మేం ఎప్పుడూ కంకర, యిటుక, సిమెంటు, టిప్పర్లు అనే పదాలు మాట్లాడతా ఉంటాం; వాళ్లు మార్క్సు, ఎంగెల్సు, బూర్జువాలు, పేదలు అనే మాటలు మాట్లాడతా ఉంటారు".

పెట్టగూడదులే. సరేనా?" అంటూ నా భుజాన్ని అనునయంగా తట్టాడు గోవిందరెడ్డి.

ఆ తర్వాత శంకరయ్య లేచొచ్చి విషయం చెప్పడం, పుస్తకం వివరాలడిగి ఒక డీటీపి సెట్టు తీసుకుని పదిహేనువేల రూపాయలకి చెక్కు రాసివ్వడం జరిగిపోయాయి.

మళ్లీ నిలబడుకున్న నా భుజమ్మీద చెయ్యేసి, నువ్వీసారి కత రాస్తే తీసుకొచ్చి చూపిచ్చు, సదవతా" అన్నాడు గోవిందరెడ్డి.

"అలాగే సార్" అన్నాను నవ్వుతూ.

ఆరోజు అలా జరిగిపోయింది గోవిందరెడ్డితో మా అనుభవం.

• • •

ఇది జరిగిన నెలరోజుల తర్వాత మళ్లీ మేం ముగ్గురం పళని శంకరయ్య కవిత్వం పుస్తకం తీసుకుని మెట్టా గోవిందరెడ్డి ఇంటికి పొయ్యాం. ఇంటిబయట లాన్లో చెట్టుకింద కూర్చుని ఉండాడు గోవిందరెడ్డి. ఎవరో ఇద్దరితో మాట్లాడుతూ ఉండాడు. మమ్మల్ని చూస్తూనే వాళ్లు లేచారు బయలుదేరడానికి.

కవిత్వం పుస్తకం చేతిలోకి తీసుకుని పేజీలు అటూఇటూ తిప్పి, "ఇంతకు ముందు నువ్విచ్చినవే గదా. సదివినాలే బాగుండాయి. పుస్తకం బాగానే వచ్చిందిలే" అని మెచ్చుకున్నాడు. అనంతరం నావేపు తిరిగి నవ్వుతూ ...

"ఏం రాజారెడ్డీ .. కథ రాశావా?" అన్నాడు.

అందుకు సిద్ధంగా ఉన్న నేను కవరు చేతికిచ్చాను.

కవరులోని కథ బయటకు తీసి మనసులో కథ పేరు చదివి, పక్కనే మునికంటి రాజ అని చూసి "ఇట్రావయ్యా రాజా" అన్నాడు నవ్వుతూ.

దగ్గరకెళ్లాను.

"నువ్వేం ఉద్యోగం జేస్తా ఉండావు?" అనడిగాడు.

"ప్రైవేటు స్కూల్లో టీచరు సార్" అన్నాను నవ్వుతూ.

"అదిగో .. ఆ చెట్టు జూశావా! ఆ పెద్ద మొదులుకి పైన నాలుగైదు కొమ్మలుండాయి గదా?"

"ఉండాయి సార్"

"వాటిల్లో ఒకటి పెద్దది. యింకో రెండు చిన్నయి. ఇంకొకటి యింకా చిన్న కొమ్మ. అవునా?"

"అవును సార్"

"వాటికి మళ్లీ సన్న కొమ్మలు, రెమ్మలు, ఆకులు ఉండాయి గదా. ఇప్పుడు ఆ దూరంగా ఉన్న పెద్దకొమ్మ ఆకులకీ యీ చిన్నకొమ్మ ఆకులకీ తామంతా ఒకే మాను బిడ్డలమని తెలిసే అవకాశం ఉండాదా?"

"ఆకులుగదా సార్. తెలీకపోవచ్చు" అన్నాను.



"వాటిలో ఒక ఆకుకి తెగులు తగిలిందని యింకొక ఆకు ఊడేసుకోవాలా? పిచ్చోడా, మన బతుకుల్లో విధిపాత్ర కూడా బాగానే ఉంటాది. నువ్వెంత శీలవంతంగా బతకాలనుకున్నా మన పుట్టుక మన చేతుల్లో ఉండదుగదా. కొందరికి లేవని పుట్టుకతో వచ్చిన కవచ కుండలాలని తెగ్గొట్టుకుంటే కర్ణుడికైనట్టే అవతాది. నీకు ఆస్తిపాస్తులు ఉండాయా? చిత్తూరోళ్లా మీరు?" అనడిగాడు.

"అవును సార్, లేవు సార్" అన్నాను దేనికి ఏదన్నానో తెలీకుండా.

"అమాయకుడా. కులం అన్నిటికన్నా ఖరీదైన ప్రొడక్టు. వేలకోట్ల సర్క్యులేషన్ కులం వల్లే జరగతా ఉండాయి. కాబట్టి నా మాటిను".

**"అంబేద్కర్‌ని ఉపయోగించుకునే వాళ్లు చాలామంది ఆయన్ని తమ కుల నాయకుడుగా కుదిస్తావుండారు. కానీ నేను గొప్ప దేశనాయకుడుగా జూస్తా అంబేద్కర్‌ని. ఇంతకీ నేజెప్పేది యేందంటే పండు చెట్టుకి అతుక్కుని ఉంటే ఉండే అందం వేరు, కోసేస్తే ఉండే అందం విలువా వేరు. నువ్వు కులం నించి వేరుపడిపోటాక, నీ ప్రిన్సిపుల్స్ నాకిష్టమే. కాని మన కులంలో మంచి కవి, కతకుడు ఉండాడంటే మన కులానికి గౌరవం, నీగ్గూడా కులం సపోర్టు..."**

"సరే సార్".

"ఈ కతకి ఎంతిస్తారు నీకు?"

"అయిదొందలో వెయ్యో ఇస్తారు సార్".

"అద్సరే గాని, ఇప్పుడు నేను జెప్పేది యిను. ఈ కతలో ఈడ నీ పేరుంది జూడు. దాని పక్కన రెడ్డి అని రెండక్షరాలు రాస్తే - ఇప్పుడే రాయాల - లక్ష రూపాయలిస్తా" అన్నాడు గోవిందరెడ్డి.

ఒక్క క్షణం నేనాశ్చర్యపోయాను. ఒక్కసారిగా కొండ శిఖరం పైనుండి రాలి పడుతున్న ఫీలింగ్. అదే సమయంలో మొదటిసారిగా ఎక్కిన విమానం టేకాఫ్ తీసుకుంటున్న ఫీలింగ్. ఏది నిజం .. రెండూనా ... నాకు అర్థం కాలేదు.

"ఒరే సీదేమప్పా బిడవా. ఒక లక్ష రూపాయలిచ్చి నేనేం నీ శీలాన్ని పాడు జెయ్యడం లేదులే అబయ్యా. సాహిత్యంలో గుర్తింపుతో పాటు సంఘంలో గూడా గుర్తింపు దెచ్చుకో. రాయి రాయి. రెడ్డి అని రెండక్షరాలు రాయి. అది చూసి నేను ఇంట్లోనించి చెక్కుబుక్కు తెప్పిస్తా!"

నేను పెన్ను కోసం జేబిలోకి చెయ్యి పెట్టాను.

ఇక నుంచి నా పేరు మునికంటి రాజారెడ్డి.

● రచయిత సెల్ : 95813 97500

## డబ్బు ... డబ్బు ... డబ్బు ...

ఒకరి తర్వాత ఒకరుగా తమ ముందుకు వస్తున్న నిందితులను చూసి విలేఖరుల్లో గుసగుసలు ప్రారంభమయ్యాయి.

" గుజ్జు శ్రీధర్ రెడ్డి, గుజ్జు సాయిప్రసాద్ రెడ్డి కజిన్స్ వీరు సైంటిఫిక్ సెక్యూరిటీ సర్వీసెస్‌లో పనిచేస్తున్న సమయంలో కాకినాడ, రాజమండ్రి ఏటీఎంలలో నగదు నింపే బాధ్యతను కంపెనీ వీరికి అప్పగించింది. హతుడు శ్రీనివాస్ వీరితో కలిసి పనిచేసేవాడు. ఏటీఎంలలో నగదు నింపే సమయంలో వీరు కొంత కొంత డబ్బును కాజేయడం మొదలెట్టారు. సాధారణంగా ఏటీఎంలలో పెట్టిన డబ్బును ఎస్‌బిఐ ఆడిట్ బృందం ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అయితే, ఆడిట్‌కు వచ్చేవారు తాము ఎప్పుడు వస్తున్నారో ఆ సమయాన్ని ముందే నిందితులకు తెలపడంతో వీరు ఒక పక్కా ప్లాన్ వేశారు. కాకినాడలో ఆడిట్ జరిగితే, రాజమండ్రి ఏటీఎంలలోని డబ్బు తీసుకుని వచ్చి అడ్జస్ట్ చేసేవారు. రాజమండ్రిలో అయితే కాకినాడ డబ్బు తెచ్చేవారు. బ్యాంకు సిబ్బందికి ఏ మాత్రం అనుమానం రాకుండా దాదాపు ఆరున్నర కోట్ల రూపాయలకు పైగా ఏడాది కాలంలో దోచుకున్నారు. ఇందులో ప్రసాద్ రెండు కోట్ల రూపాయలు, శ్రీధర్ మూడు కోట్ల రూపాయలు, శ్రీనివాస్ కోటి రూపాయల వరకు తీసుకున్నారు. ముగ్గురూ కూడా తమకు సహకరించిన చిన్నాచితక ఉద్యోగులకు తలా కొంత పడేశారు. ఏడాదికి పైగా వీరు ఈ విధంగా డబ్బు దోచుకుని తమ విలాసాలకు ఖర్చుపెట్టుకున్నారు. ప్రసాద్ విదేశాలు తిరుగుతూ జల్సా చేస్తే, శ్రీధర్‌రెడ్డి వైసీపీలో తిరుగుతూ కొంత డబ్బును ఖర్చు చేశాడు. కొంత డబ్బు సినిమాల్లో పెట్టుబడిగా పెట్టాడు. గత కొంతకాలంగా ఆడిట్ సమయంలో వీళ్లు డబ్బు ఎడ్జస్ట్ చేయలేకపోతున్నారు. ఎందుకంటే అప్పటికే ముగ్గురూ కోట్ల రూపాయలు ఖర్చు పెట్టేశారు.."

"డబ్బు మ్యానేజ్ చేయడానికీ, శ్రీనివాస్ హత్యకూ సంబంధం ఏమిటి సార్..." సమావేశంలో ప్రశ్నించారొకరు.

" అక్కడికే వస్తున్నా... తమ కార్యాలయంలో దోపిడీ జరిగిందని నమ్మించి ఈ మొత్తం డబ్బంతా ఒకేసారి పోయినట్టు సృష్టించాలని పథకం వేశారు. వాచ్‌మ్యాన్‌ను చంపేసి ఆ నేరం దోపిడీ దొంగల మీదకు నెడదాం అనుకున్నారు. ఈ పథకం విన్న శ్రీనివాస్ కొంత భయపడ్డాడు. డబ్బు వాడుకోవడం వరకు పర్వాలేదు కానీ హత్య అనేసరికి వద్దని వారించాడు. దీంతో ప్రసాద్, శ్రీధర్ ఆందోళన చెందారు. శ్రీనివాస్ వల్ల తమ గుట్టు బయటపడుతుందని అనుమానించారు. ఈలోగా ఒకరోజు వాచ్‌మ్యాన్ డ్యూటీకి రాకపోవడంతో శ్రీనివాస్ నైట్ డ్యూటీ చేస్తానని లాకర్ గదిలో పడుకోవడానికి సిద్ధమవడంతో అదే రోజు అతడ్ని చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిద్దామనుకున్నారు. అనుకున్నట్టుగానే శ్రీధర్, ప్రసాద్‌లిద్దరూ వీర వెంకటేశ్వరరావు, సీరప శీనుల సహకారంతో శ్రీనివాస్‌ను దారుణంగా హత్య చేశారు. అతను ఉరి వేసుకున్నట్టు కేబుల్ వైరు మెడకు చుట్టారు. పోలీసు ఆనవాలు జాడ కనుక్కోకుండా ఆ ప్రాంతంలో కారం పొడి చల్లారు. లాకర్ తెరిచి 58 లక్షల నగదు తీసుకుని తెలివిగా తప్పించుకుని పారిపోయారు. ఎంతసేపూ దోపిడీ, హత్య కోణంలోనే దర్యాప్తు సాగించిన మాకు చాలాకాలం నుంచి ఇక్కడ డబ్బు మాయమవుతున్నట్టు ఆలస్యంగా బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు రూటు మార్చాం. దాంతో అసలు దొంగలు దొరికారు" అంటూ సమావేశాన్ని ముగించారు ఎస్పీ.

**- వేముల సత్యనారాయణ,**

99854 88800